ప్రజాశక్తి
శుక్రవారం 28 మార్చి 2025

విద్యార్థినికి పరామర్శ

దివ్యను పరామర్శిస్తున్న డిప్యూటీ వార్డెన్

ప్రజాశక్తి -అనంతగిరి: అనారోగ్యంతో బాధపడుతూ అరకు ఏరియా ఆసుపత్రిలో చికిత్స అనంతరం గురువారం డిశ్చార్జి అయి ఇంటికి చేరుకున్న చేరిన ఏడో తరగతి విద్యార్థిని కిమిడి దివ్యను బాలికల పాఠశాల- వన్ డిప్యూటీ మేట్రిన్ రూపవతి పరామర్శించారు. విద్యార్థిని ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉందని తెలిపారు పాఠశాలలో ప్పుడప్పుడు అనారోగ్య సమస్యలతో ఇబ్బందిగురయ్యే దివ్య పరిస్థితిని ఆమె తల్లిదండ్రులకు తెలియజేశానని, అనంతరం వైద్యం నిమిత్తం అరకు ఏరియాస్పత్రికి తరలించామన్నారు. వైద్యసేవల అనంతరం దివ్య కోలుకుందని వైద్యులు ధ్రువీకరించినట్లు తెలిపారు. ఆరోగ్యం మునుపటిలా సాదారణ స్థితికి వచ్చేవరకు జాగ్రత్తలు తీసుకోవాలని, తర్వాత పాఠశాలకు రావాలని సూచించారు.

ఎంపిపి పీఠం టిడిపి కైవసం

ఎంపిపిగా ఎన్నికైన అప్పలరాజు, చేతులెత్తి ఎన్నుకుంటున్న ఎంపిటిసిలు,

ప్రజాశక్తి -జి.మాడుగుల : జి.మాడుగుల ఎంపిపి స్థానాన్ని టిడిపి కైవసం చేసుకుంది. గురువారం జరిగిన ఉప ఎన్నికల్లో వైతలి ఎంపిటిసి లంబూరి అప్పలరాజు ఎంపిపిగా ఎన్నుకోబడ్డారు మండల పరిషత్ పరిధిలో 15 మంది ఎంపీటీసీలకుగాను ఒకరు రాజీనామా, మరొకరు మృతితో ప్రస్తుతం 13 మంది ఎంపిటిసిలు మాత్రమే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఖాళీగా ఉన్న ఎంపిపి స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించేందుకు ఎంపిటిసిలతో ప్రత్యేక సమావేశం నిర్వహించగా, ఇద్దరు సభ్యులు గైర్హాజరుతో 11 మంది పాల్గొన్నారు. కోరం సరిపోవడంతో ఎన్నిక నిర్వహించగా, నలుగురు ఎంపిటిసిలు వైసిపికి మద్దతుగా, ఏడుగురు సభ్యులు చేతులెత్తి, మద్దతు తెలపడంతో టిడిపికి చెందిన అప్పలరాజు ఎంపిపిగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

కొనసాగుతున్న డోలీ మోత కష్టాలు

గర్భిణిని డోలీలో మోసుకెళుతున్న కుటుంబసభ్యులు

ప్రజాశక్తి -అనంతగిరి : ప్రసవ నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని డోలిమోతలో అసుపత్రికి తరలించిన ఘటన మండలంలోని లుంగపర్తి పంచాయతీ మల్లెపాడులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నిండు గర్భిణి బిసోయి కాంతమ్మకు గురువారం పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు డోలి కట్టి, కొండమార్గంలో ఆసుపత్రికి మోసుకెళ్లారు. గ్రామానికి కనీస రోడ్డు సౌకర్యం లేకపోవడం, కొండమార్గంలో రాళ్లురప్పలతో కూడిన కాలిబాటే ఉండడంతో గ్రామం నుండి లుంగపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు సుమారు 6 కిలోమీటర్లు ఎత్తైన కొండ కోనల నడుమ డోలిలో గర్భిణి కాంతమ్మను మోసుకొచ్చారు. మూడునెలల క్రితం ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పినకోటలో రోడ్డునిర్మాణాలకు శంకుస్థాపన చేసిన సందర్భంలో డోలిమోతలనేవి మన్యంలో కనబడకుండా చేస్తానని మాటిచ్చారని, అయితే ఆ దిశలో ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు డోలిమోత కష్టాల నుంచి తమకు ఎప్పటికి విముక్తి కలుగుతుందోనని ఆశగా ఎదురుచూస్తున్నారు.

దరఖాస్తుల స్వీకరణతో సరి!

ఉచిత డిఎస్‌సి కోచింగ్ ఎప్పుడో? :సన్నిబాబు

ప్రజాశక్తి- పెదబయలు : పాడేరు ఐటిడిఎ ద్వారా గిరిజన నిరుద్యోగులకు ఉచిత డిఎస్‌సి కోచింగ్ వెంటనే నిర్వహించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు బొండా సన్నిబాబు డిమాండ్ చేసారు. గురువారం విలేకర్లతో సన్నిబాబు మాట్లాడుతూ, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు పూర్వ ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం 16,347 టీచర్ పోస్టులతో మెగా డిఎస్‌సి ప్రకటించిన వెంటనే అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని అర్హులైన ఎస్‌టి అభ్యర్థులకు ఉచిత డిఎస్‌సి కోచింగ్ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానించారన్నారు. గత ఆగస్టులో నోటిఫికేషన్ జారీచేసి, 300మంది అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇస్తామని దరఖాస్తులు ఆహ్వానించగా, 1200మంది అభ్యర్థులు పాడేరు ఐటిడిఎలో దరఖాస్తు చేసుకున్నారన్నారు. దరఖాస్తులు స్వీకరించి ఏడు నెలలు గడిచినా డిఎస్‌సి కోచింగ్ విషయంలో ఐటిడిఎ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. డిఎస్‌సి కోచింగ్‌కు అతీగతీ లేని పరిస్థితుల్లో ఇటీవల గ్రూప్-1శిక్షణకు ఐటిడిఎ మోనటరింగ్ సెల్ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారన్నారు. దరఖాస్తుల స్వీకరణతోనే శిక్షణ పూర్తయినట్లు చేతులు దులుపుకోకుండా, నిరుద్యోగ గిరిజన అభ్యర్థులకు మేలు చేకూరేలా ఉచిత శిక్షణకు చర్యలు చేపట్టాలనికోరుతున్నారు ఏప్రిల్ మొదటివారంలో డిఎస్‌సి నోటిఫికేషన్ ఉంటుందని సిఎం చంద్రబాబు, విద్యాశాఖమంత్రి లోకేష్ ప్రకటించిన నేపథ్యంలో ఇప్పటికైనా నిరుద్యోగ టీచర్ అభ్యర్థులకు ఉచితశిక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని సన్నిబాబు కోరారు. ఈ మేరకు జిల్లాకలెక్టర్, ఐటిడిఎ పిఒ స్పందించాలని కోరారు.

అభివృద్ధికి సహకరించండి

జిసిసి చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న కుమారి

ప్రజాశక్తి- పెదబయలు : మండలంలోని వివిధ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు ఇతర సమస్యల పరిష్కారానికి సహకరించాలని టిడిపి మండల అధ్యక్షులు సీకరి కుమారి కోరారు. గురువారం జిసిసి రాష్ట్ర చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. మండలంలోని సమస్యలను, అభివృద్ధి అవసరాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇతర మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించాలని కోరారు. పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. బంగారుమెట్ట నుంచి తోరంగుల వరకు ఆరు కిలోమీటర్ల బిటి రోడ్డు, సీకారి గ్రామంలో పోతురాజు గుడి నుండి శ్మశాన వాటిక వరకు, సప్పన్న గుడి నుంచి బూడియా గుడి వరకు 700 మీటర్ల సిసి రోడ్డు, లక్ష్మీపేట బిటి రోడ్డు నుండి లువ్వాసింగి వరకు సిసి రోడ్డు, పురుగోడు పుట్టు బిటి రోడ్డు నుంచి వెలపాలెం వరకు బిటి రోడ్డు, కిముడుపల్లి నుంచి లుగుసారిపుట్టు, అరడగూడెం వరకు బిటి రోడ్డు నిర్మాణాలు ఇతర సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించి, అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు యువత నేత కూడా భూషణరావు, బాకూరు వెంకటరమణ పాల్గొన్నారు

29న టిడిపి జెండా ఆవిష్కరణకు రండి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఈనెల 29న టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రం డుంబ్రిగుడలో పార్టీ పతాకావిష్కరణ, ఇతర కార్యక్రమాలను చేపట్టనున్నామని టిడిపి మండల అధ్యక్షుడు టి సుబ్బారావు తెలిపారు. యూనియన్ బ్యాంకు సమీపంలో జెండాను ఆవిష్కరణ ఉంటుందన్నారు. పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు విధిగా హాజరు కావాలనికోరారు. పార్టీ నాయకులు స్వామి, గీత, దన్నెరావు, రవి, జక్కయ్య పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలి

• తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ 102 సిబ్బంది నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ 102 సిబ్బంది

ప్రజాశక్తి -పాడేరు: తమకు కనీస వేతనాలు అమలుకు కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలని గురువారం జిల్లా కేంద్రంలో తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ 102 సిబ్బంది నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సుందరరావు తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ అల్లూరి జిల్లా అధ్యక్షులు వాసు మాట్లాడుతూ,మార్చి 31తో ముగుస్తున్న తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్, 102 టెండర్ ను , వెంటనే పునరుద్ధరణ చేయాలన్నారు. తొమ్మిదేళ్లుగా రూ.7,870జీతానికి పనిచేస్తున్న కెప్టెన్స్‌కు కనీసవేతనం రూ.18600 చెల్లించాలని, నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో పనిచేస్తున్న తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పని చేస్తున్న వారందరిని ప్రభుత్వల కెప్టెన్లుగా కొనసాగించి టెండర్లు వెయ్యాలని, అప్కాస్‌లో కొనసాగించాలని, ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని కోరారు. దీనిపై పభుత్వానికి పలుమార్లు విన్నవించినా స్పందన లేదన్నారు. ప్రతి ఆరు నెలలకు కరువు భత్యం చెల్లించాలని,,సిక్ లివ్ లు ఇవ్వాలని, ఒకే పథకంలో పని చేస్తున్నవారికి ఒకే రకమైన వేతనం చెల్లించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, ,రిటైర్‌మెంట్ వయస్సు 62ఏళ్లకు పెంచాలని కోరారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు దామోదరం, బాల చందర్, కొండబు, సింహాచలం, గణపతి, మహేష్, సింహచలం పాల్గొన్నారు.

శరభన్న అకాల మరణం తీరనిలోటు

• సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం
• గిరిజనోద్యమ నేతకు ఘననివాళి

శరభన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లోకనాథం, పార్టీ నాయకులు

ప్రజాశక్తి- పాడేరు : గిరిజన ఉద్యమనేత, సిపిఎం పెదబయలు మండల నాయకులు కె.శరభన్న అకాల మరణం సిపిఎంకు, ఆదివాసీ ఉద్యమానికి తీరని లోటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె లోకనాథం అన్నారు. గురువారం పాడేరులో సిపిఎం కార్యాలయంలో పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో శరభన్నకు పార్టీ నేతలు పార్టీ శ్రేణులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం మాట్లాడుతూ అడుగులుపుట్టు పంచాయతీ పరిధి వడ్డేపుట్టు గ్రామానికి చెందిన శరభన్న 15 ఏళ్లుగా ఆదివాసీల సమస్యలపై ఎన్నో పోరాటాలు నిర్వహించి. సిపిఎం మండల కమిటీ సభ్యునిగా, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షునిగా, సిఐటియు మండల కార్యదర్శిగా పనిచేసి విశిష్ట సేవలు అందించారన్నారు.ఎన్ని ఆటుపోట్లు వచ్చినా తట్టుకుని గిరిజన సమస్యల పరిష్కారానికి విశేషంగా కషి చేశారని కొనియాడారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, గిరి గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని, పివిటిజిలకు అంత్యోదయ కార్డులు ఇవ్వాలని, రహదారులు నిర్మించాలని ఉద్యమాలు నడిపారన్నారు పెదబయలు మండలంలో గిరిజన సంఘం నేతగా శరభన్న అనేక పోరాటాలు, ఆందోళనలు నిర్వహించారని, గిరిజన హక్కుల కోసం నిరంతరం పనిచేశారని తెలిపారు. ముఖ్యంగా పివిజిటిల సమస్యలపై ఉద్యమాలు చేశారన్నారు. సిపిఎం కార్యకర్తగా ఆకింతభావంతో ప్రజా శ్రేయస్సు కోసం తన తుదిశ్వాస వరకూ పనిచేశారన్నారు. ఆయన మతి పార్టీకి, గిరిజన ఉద్యమానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స , జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, దీసారి గంగరాజు , బిసిహెచ్ పడల్, వి ఉమామహేశ్వరావు, పోతురాజు, త్రినాధ్ , జిల్లా నాయకులు పాల్గొన్నారు

ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేయాలి

ప్రజాశక్తి -పాడేరు : క్రైస్తవ బోధకులు పనగల ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి పి అప్పలనరస ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాజమండ్రిలో బుధవారం జరిగిన ఫాస్టర్ మరణంపై ఘటనపై ప్రజల్లో అనేక అనుమానాలున్నాయన్నారు. క్రైస్తవమత ప్రచారం చేస్తున్నాడనే కారణంతో కొంతమంది ప్రవీణ్ మృతిపై అనుమానాలు వ్యక్తం చేయడం, గతంలో జరిగిన కొన్ని ఘటనల నేపథ్యంలో తనను హత్య చేయొచ్చని ప్రవీణ్ వెల్లడించిన నేపథ్యంలో ఇది సాదారణ మరణం కాకపోవచ్చని పలువురు భావిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రవీణ్ మృతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

2022 వరద ముంపు ప్రామాణికంగా ప్రతి గ్రామానికీ న్యాయం చేయాలి

సిపిఎం నేతలు సీతారామయ్య, బొర్రయ్య

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య

ప్రజాశక్తి-కూనవరం

2022 సంవత్సరంలో వచ్చిన వరదలకు 48 గ్రామాలు ముంపునకు గురయ్యాయని, దానిని ప్రామాణికంగా తీసుకొని ప్రతి గ్రామానికీ న్యాయం చెయ్యాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గోదావరి వరద ప్రాజెక్ట్ దగ్గర 38 అడుగులు చేరితే మండలంలోని 48 గ్రామాలు మునుగుతున్నాయని, కాని 2025లో 10 గ్రామాలకు పరిహారం ఇస్తామని చెబుతున్న ప్రభుత్వం మిగిలిన గ్రామాలకు ఎప్పుడు పరిహారం ఇస్తుందని ప్రశ్నించారు. ప్రాజెక్ట్ నిర్మాణం 2027 కల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం చెప్పడం వల్ల మిగిలిన గ్రామాల ప్రజలు అయోమయం పరిస్థితిలో ఉన్నారన్నారు. ప్రతి ఏటా ముంపు వల్ల ఈ గ్రామాల ప్రజలు ఎంత ఇబ్బంది పడుతున్నారో ప్రభుత్వానికి తెలియడం లేదా? అని ప్రశ్నించారు. ఊరు, ఇల్లు, పంట భూములు మునిగిపోయి, విద్య, వైద్యానికి దూరమై, నిత్యవసర సరుకుల కోసం నానా ఆగచాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు, విద్యుత్ లేక రెండు మూడు నెలల పాటు ప్రజలు అవస్థలు పడుతున్నారని గుర్తు చేశారు. ప్రజలు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా అధికారులకుగాని, ప్రభుత్వానికి గాని ముంపు గ్రామాల ప్రజలకు న్యాయం చేయడానికి ముందుకు రాకపోవడం దారుణమన్నారు. తప్పుడు ప్రకటనలతో ప్రజలను మోసం చెయ్యాలని చూస్తే సీపీఎం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా 2022 వరదలను ప్రామాణికంగా చేసుకొని ముంపు గ్రామాలని గుర్తించాలని, ప్రాజెక్టు ముంపులో ఉన్న భూములకు, కాంటూరు లెక్కల ప్రకారం మునుగుతున్న భూములకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు భూమికి భూమి ఇవ్వాలని, ఆ భూమికి సాగునీటి సదుపాయం కల్పించాలని, వరద ముంపు లేని ప్రాంతాల గుండా రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని, విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు, ఎంపీటీసీ అమ్మాజీ, జయసుధ, మడెం బాబు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రామానాయుడుకుఇ వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

జలవనరుల శాఖలో ఖాళీలు భర్తీ చేయాలి

ప్రజాశక్తి-రంపచోడవరం

జలవనరుల శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి, తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షులు మఠం విజయభాస్కర్ వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం పోలవరం పర్యటనలో భాగంగా మంత్రి రామానాయుడును ఎమ్మెల్యే కలిసి విన్నవించారు. రాజవొమ్మంగి మండలంలోని కిర్రాబు ఆనకట్ట నిర్మించాలని, రంపచోడవరం పరిధిలోని జలవనరుల శాఖలో ఉన్న ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే శిరీషా దేవి తెలిపారు.

జీలుగు చెట్టు పడి తాటాకిల్లు ధ్వంసం

- నిలువ నీడ కోల్పోయిన పేద మహిళ

ప్రజాశక్తి-కొయ్యూరు : గాలివాన కారణంగా జీలుగు చెట్టు కూలి తాటాకు ఇంటిపై పడటంతో నిరుపేద గిరిజన మహిళ నిలువ నీడను కోల్పోయి దీనస్థితిలో సహాయాన్ని అర్థిస్తోంది. మండలంలోని కినపర్తి పంచాయతీ వలసంపేట గ్రామంలో బుధవారం సాయంత్రం ఈదురుగాలితో కురిసిన భారీ వర్షానికి చదల శాంతమ్మ ఇంటి పక్కనే ఉన్న జీలుగు చెట్టు కూలి ఆమె నివాస గృహంపై పడింది. భర్తను కోల్పోయిన శాంతమ్మ పేదరికంలో జీవిస్తోంది. ఇటీవలే గర్భిణిగా ఉన్న తన కూతురిని పురిటికి తీసుకువచ్చింది. గాలివాన బీభత్సానికి జీలుగు చెట్టు ఇంటిపై పడి ఇల్లు పూర్తిగా ధ్వంసం కావడంతో శాంతమ్మ నిలువ నీడను కోల్పోయింది. నెలలు నిండిన తమ కుమార్తెను ఎక్కడ ఉంచాలో ఏం చేయాలో దిక్కుతోచక లబోదిబోమంటూ రోదిస్తోంది. శాంతమ్మను ఆదుకునేందుకు ప్రభుత్వం, దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలని ఆమె కోరుకుంటుంది.

ఈదురు గాలులకు తాటాకు ఇంటిపై పడిన జీలుగ చెట్టు, కుంగి పోయిన ఇల్లు

శబరి నదిలో ముంపు సమయంలో సహాయక చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రకృతి విపత్తుల నుండి రక్షణపై మాక్ డ్రిల్

ప్రజాశక్తి-చింతూరు

ప్రకతి విపత్తులు, తుఫాన్, వరదల సమయంలో ఏ విధంగా రక్షణ పొందాలో ముంపు మండలాల్లో ప్రజలకు అవగాహన కల్పించడానికి వివిధ ప్రభుత్వశాఖల ఆధ్వర్యంలో చింతూరు సంత బజార్ క్రీడా మైదానంలో గురువారం మాక్ డ్రిల్ కార్యక్రమం నిర్వహించారు. వరదల్లో సహాయ సహకారాలు ఏ విధంగా అందించాలో వివిధ శాఖల ద్వారా ప్రదర్శన నిర్వహించారు. ముంపు జరిగిన ప్రాంతాల్లో ముందస్తుగా మెడికల్ సదుపాయం, ఆహార పదార్థాల తరలింపు, ప్రవాహంలో కొట్టుకుపోయే వారిని ఎలా కాపడటంపై అవగాహన కల్పించారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం వారు శబరి నదిలో బోట్లు ద్వారా ప్రమాదంలో కొట్టుకుపోతున్న వారిని రక్షించే విధానాన్ని ప్రాక్టికల్‌గా ప్రదర్శించారు. భూకంపాలు సమయంలో కూలిపోయిన భవనాల్లో బాధితులను రక్షించే విధానాన్ని, మంటల్లో చిక్కుకొని ప్రమాదానికి గురి అవుతున్న వారిని అగ్నిమాపక శకటం సిబ్బంది ప్రదర్శన నిర్వహించి కాపాడే విధానాన్ని ప్రదర్శించారు. వరదల సమయంలో పశువులకు తీసుకోవలసిన జాగ్రత్తలను పశువర్ధక శాఖ అధికారులు పశువులను కాపాడే విధానాన్ని తెలిపారు. వరదల కారణంగా కలుషిత నీరు సేవించకుండా ప్రజలకు ఆర్డబ్ల్యూఎస్ వారు రక్షిత నీటిని అందించే విధానాన్ని రూపకల్పన చేశారు. జిసిసి ద్వారా ముంపు ప్రాంతాల్లో వరద బాధితులకు నిత్యావసరాలు అందించే విధానాన్ని తెలియజేశారు. ఐసిడిఎస్ సంస్థ ద్వారా గర్భిణీలకు చిన్న పిల్లలకు పోషకాహారం అందించే విధానం, వరదల్లో అధికంగా నీరు కలుషితమైన నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్డబ్ల్యూఎస్ వారు సూచనలు చేశారు. ముంపునకు గురైన విద్యుత్తు స్తంభాలు వాటి ద్వారా ప్రజలకు ప్రమాదం కలగకుండా సమాచారం అధికారులకు చేరావేసేలా ప్రజల నుండి సమాచారం కొరకు ఏపీఈడిసిఎల్ సంస్థ వారు ఏర్పాటు చేసిన సమాచార కేంద్రం తదితర సహాయక చర్యల ప్రదర్శన స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జగన్నాథరావు, చింతూరు, ఎటపాక తహశీల్దార్లు చిరంజీవి, సుబ్బారావు, చింతూరు సీఐ తెల్లం దుర్గాప్రసాద్, ఎస్ఐ రమేష్, డిప్యూటీ డిఎంహెచ్ఓ పుల్లయ్య, ఆసుపత్రి సూపరింటెండెంట్ కోటిరెడ్డి, ఏటిడబ్ల్యూఓ కే.సుజాత, ఆర్టిఏ చల్లారావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రత్నమాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న సిపిఎం మండల కార్యదర్శి, సర్పంచ్ పులి సంతోష్‌కుమార్

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

ప్రజాశక్తి-విఆర్.పురం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేసిన పనుల సామాజిక తనిఖీలో భాగంగా విఆర్.పురం మండలం రేఖపల్లి ఎంపిడిఒ కార్యాలయం వద్ద గురువారం ప్రజావేదిక నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథులుగా ఎంపీపీ కారం లక్ష్మి, జెడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, స్థానిక సర్పంచ్ పూనం సరోజిని పాల్గొని మాట్లాడారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 10,13,69101 ఖర్చు చేయగా, ఇందులో వేతనాల రూపంలో 8,84,04,368, మెటీరియల్ రూపంలో 1,29,64,733 ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. రికవరీస్ రూ.8,460, ఫైండ్ రూపంలో రూ.8,000, రెటిఫికేషన్ రూపంలో రూ.16,000 వచ్చినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మండలంలోని పంచాయతీల్లో సమస్యలపై శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డివిఒ సిహెచ్ నిర్మలాదేవి, ప్రొసీడింగ్ ఆఫీసర్ ఎల్ రాంబాబు, ఎంపీడీవో ఆంజనేయ ప్రసాద్, ఇఒపిఆర్డి శ్రీకాంత్ రెడ్డి, క్లస్టర్ ఏపీడి జి.శ్రీకాంత్, ఎస్ఆర్పి సిహెచ్ రాజు, ఏపీవోస్ ఎస్ రాఘవయ్య, బి.చిరంజీవి రావు, ఉపాధి సిబ్బంది, సిపిఎం మండల కమిటీ సభ్యులు పోడియం రామ్మూర్తి పాల్గొన్నారు.

ఇకెవైసికి గిరిజనం అగచాట్లు

సిగ్నల్స్, సాంకేతిక సమస్యలతో జాప్యం

గడువు పెంచాలని కార్డుదారుల వినతి

ఏప్రిల్ నెల రేషన్ యథావిధిగా ఇవ్వాలి : సన్నిబాబు

ప్రజాశక్తి- పెదబయలు : నెలాఖరులోగా రేషన్‌లబ్ధిదారులు ఇకెవైసి నమోదు చేసుకోకుంటే, ఏప్రిల్ నెలలో కోటా సరుకులు అందవని అధికారులు, ప్రభుత్వం హెచ్చరికలతో కార్డుదారులు ఆవేదన చెందుతున్నారు. మారుమూల గ్రామాల నుంచి పడిగాపులు పడుతూ, ఇంటిల్లిపాది మండల కేంద్రంలోని రేషన్‌డిపోలు, ఆధార్‌సెంటర్లకు వచ్చిన సిగ్నల్స్, ఇతర సాంకేతిక సమస్యలతో ఇకెవైసి నమోదు కాకపోవడంతో పడుతున్న అవస్థలు చెప్పనలవికాదు.

పెదబయలు మండలంలో23 గ్రామ పంచాయితీ పరిధిలో 39 డిఆర్‌డిపోలున్నాయి. ఆయా డిపోల పరిధిలోని రేషన్‌కార్డులు ఇకెవైసి కోసం మండల కేంద్రాలకు వచ్చి, క్యూలైన్లలో పడిగాపులు పడుతున్నారు. అయితే ఇకెవైసి నమోదులో ఇబ్బందులతో అనేకమందికి సకాలంలో పనులు జరగడం లేదు. బయోమెట్రిక్‌లో వేలిముద్రలు నమోదు కాకపోవడం, ఇతర సమస్యలతో ఏం చేయాలో పాలుపోని స్థితి ఉంది. నెలాఖరుకు కొద్దిరోజులే గడువు ఉండడం, అందులోనూ ఉగాది, రంజాన్, రెండోశనివారం వంటి సెలవులు పోనూ, శుక్రవారం ఒక్కరోజే గడువు ఉండడంతో ఏం చేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఇకెవైసి కాకుంటే రేషన్‌సరుకులతోపాటు ప్రభుత్వ పథకాలు దూరమైపోతాయేమోనని పలు పథకాల లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇకెవైసికి వచ్చిన వారిలో వివిధ పథకాల లబ్ధిదారులతోపాటు విద్యార్థులే ఎక్కువగా ఉన్నారు

ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు బొండా సన్నిబాబు మాట్లాడుతూ ఇకెవైసి నమోదుకు మండలంలో నెలకొన్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, వచ్చేనెలలో రేషన్ సరుకులు యథావిధిగా పంపిణీకి చర్యలు చేపట్టాలని కోరారు. సిగ్నల్స్, ఇతర సాంకేతిక సమస్యలతో ఇకెవైసిలో జాప్యం జరుగుతున్నందున నమోదుకు గడువును మరికొన్నాళ్లు పెంచాలని, అందరికీ ఎ ఇకెవైసి నమోదు చేయించే బాధ్యతను ఆయా శాఖల అధికారులే చేపట్టాలని కోరారు. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీలేఖ, ఆశ కార్యకర్త బుళ్ళమ్మ , గ్రామ పెద్దలు మజ్జి నాగరాజు, పిసా కమిటీ ఉపాధ్యక్షులు బడ్నైని నాగరాజు వాలంటీర్ సింహాద్రి, నాని,రాము,గణేష్, కామరాజు గ్రామ యూత్,పెద్దలు పాల్గొన్నారు.

ఇకెవైసికి క్యూలైన్లలో పడిగాపులు పడుతున్న కార్డుదారులు

నేరాలు ఘోరాలు

బెల్ట్‌షాపుపై దాడి : మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు : మండలంలోని మాకవరం పంచాయతీ కేంద్రంలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్న పాంకి మహేష్‌బాబు అక్రమంగా నిల్వ ఉంచి మద్యం సీసాలను పోలీసులు పట్టుకున్నారు. బెల్ట్‌దుకాణంలో మద్యం విక్రయిస్తున్నట్లు విశ్వసనీయత సమాచారంతో గురువారం ఎస్‌ఐ జై రామకృష్ణ తమ సిబ్బందితో మాకవరం గ్రామంలోని కిరాణా షాపులో తనిఖీలు చేపట్టారు. అక్రమంగా విక్రయిస్తున్న 30 మద్యం సీసాల పెట్టెలను పట్టుకుని సీజ్ చేసి, దుకాణ నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు.ఒక్కొక్క పెట్టిలో 48 మద్యం క్వార్టర్ సీసాలు ఉన్నాయని వీటి విలువ రూ. 1,42, 470 ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు.

అనారోగ్యంతో ఆశ్రమ విద్యార్థిని మృతి

పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే చనిపోయిందని ఆరోపణ

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలోని పెదగరువు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి కొర్రా.వసంతకుమారి13) మూడు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖ కెజిహెచ్ చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచింది. బుధవారం విద్యార్థి గ్రామమైన పెదబయలు మండలంలోని గంపరాయి పంచాయతీ కులుభ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థిని ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యం వహించడంతో ఆసుపత్రిలో చేర్పించినప్పటికీ మృతి చెందిందని తల్లిదండ్రులు, గ్రామస్తులు చెబుతున్నారు. విద్యార్థిని అనారోగ్య సమస్యపై సమయానికి తల్లిదండ్రులకు సమాచారం కూడా ఇవ్వలేదని తెలిపారు.విద్యార్థి మరణాన్ని పాఠశాల యజమాన్యం అధికారులు గుట్టుచప్పుడు లేకుండా చేసేసారని విద్యార్థికి తల్లిదండ్రులకు వాపోయారు. సమగ్ర విచారణ చేపట్టి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, బాధ్యులైన వార్డెన్, హెచ్‌ఎంలపై తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థి, పజాసంఘాలు గ్రామస్తులు గురువారం డిమాండ్ చేశారు.

ఎటిఎం కార్డు మార్పు కేసులో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం కృష్ణాబజారు ఎస్‌బిఐ ఏటిఎం వద్ద ఒక యువతికి ఏటిఎం కార్డు మార్చి ఈ ఏడాది ఫిబ్రవరి 10న రూ.30వేలు విత్ డ్రా చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు నర్సీపట్నం డిఎస్‌పి పీ.శ్రీనివాసరావు తెలిపారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తునకు ఎస్‌పి ఆదేశాలతో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. రాజమండ్రి కొత్తపేటకు చెందిన ఇల్లపు వెంకటసాయికిరణ్ అనే నిందితుడిని అరెస్టు చేశామని తెలిపారు. నిందితుడిపై . మొత్తం 14 కేసులు ఉన్నాయన్నారు. ఒక నెల రోజుల పాటు ప్రత్యేక టీమ్ ఎంతో కష్టపడి నిందితుడిని అరెస్టు చేసిందన్నారు. కార్యక్రమంలో ట్రైనీ డిఎస్‌పి చైతన్య, టౌన్ ఎస్సై గోవిందరావు, టౌన్ ఎస్‌ఐ రమేష్ పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం-గోవాడ రోడ్లో గురువారం ఉదయం 11 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని మండలంలోని అంబేరిపురం గ్రామానికి చెందిన బి.పైడ్రాజు తీవ్రంగా గాయపడ్డాడు. పైడిరాజు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఆయన్ను ఢీకొట్టి వెళ్లిపోయింది. రోడ్డుపై పడి ఉండడాన్ని అటుగా వెళుతున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏడువాక సత్యారావు చూసి 108 వాహనానికి ఫోన్ చేసి దగ్గరుండి క్షతగాత్రున్ని అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు.

రూ.500 ఇవ్వలేదని ఆత్మహత్యకు యత్నం

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం.పాలెం పోలీసు స్టేషన్ పరిధిలో భర్త మీద అలిగిన ఓ మహిళ గురువారం ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించినట్లు సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. ఘటనకు సంబంధించి సిఐ కథనం ప్రకారం... కొమ్మాది రాజీవ్ గృహకల్పలోని బ్లాక్ నెంబర్ 24 టిఎఫ్1లో అనంతరాయుడు, సూరీడమ్మ దంపతులు నివసిస్తున్నారు. రూ. 500 ఇవ్వాలని భర్తను సూరీడమ్మ అడిగారు. భర్త నిరాకరించారు. దీంతో సూరీడమ్మ వారు నివసిస్తున్న నాలుగో అంతస్తు కిటికీపై ఉన్న సన్‌సేడ్ పైకి ఎక్కి అక్కడి నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. వెంటనే స్థానికులు పిఎం.పాలెం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ భాస్కర్ తన సిబ్బందితో వెళ్లి ఆమెతో మాట్లాడి పైకి రప్పించారు. కౌన్సెలింగ్ ఇచ్చి పంపినట్లు సిఐ తెలిపారు.

ముగిసిన అంగన్వాడీల శిక్షణ

ప్రజాశక్తి- హుకుంపేట : స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో మినీ అంగన్వాడీ కార్యకర్లతకు పోషణ బి, పడాయి మూడు రోజుల శిక్షణ ముగిసిందని సిడిపిఓ సిహెచ్ బాలమణి దేవి తెలిపారు. ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు ప్రాథమిక సంరక్షణ పోషణ, బాల్య విద్య అందించడంలో అంగన్వాడి కార్యకర్తలకు శిక్షణనిచ్చామన్నారు. అంగన్వాడి కేంద్రాలను లర్నింగ్ సెంటర్‌గా తయారు చేయాలని, మధ్యాహ్నం ఒంటిగంట తరువాత గృహ సందర్శన చేసి ఒకటి నుంచి మూడేళ్ల పిల్లలలో ప్రేరణ కలిగించాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆచరణలో అమలు చేయాలని సూచించారు. 94 మంది మెయిన్, 117 మంది మినీ అంగన్వాడీలకు రెండు విడతల్లో సిడిపిఒ, మండల పరిషత్ కార్యాలయాల్లో శిక్షణ పూర్తిచేశామన్నారు. శిక్షణలో సూపర్వైజర్లు డి అప్పల నరసమ్మ కె.హైమావతి ఎస్.కె హసీనా బేగం, పి.జానకి పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు రెండు విడతలుగా మూడేసి రోజుల పాటు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శిక్షణనిచ్చామని సిడిపిఒ వరహాలమ్మ తెలిపారు. ఈనెల 20 నుంచి 22 వరకు 97 మందికి, 24 నుండి 26 వరకు 127 మంది మినీ అంగన్వాడి కార్యకర్తలకు ముంచింగిపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బాలురు 1లో శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు.అంగన్వాడీ చిన్నారులుకు పూర్వ ప్రాథమిక విద్య,, మేధాభివృద్ధి , భాష అభివృద్ధి, ఆటపాటలు, ఆరోగ్య జాగ్రత్తలపై అంగన్వాడీలు అవసరమైన చర్యలు చేపట్టే విధంగా వారికి తర్ఫీదునిచ్చామన్నారు. శిక్షణ తరగతుల్లో రిసోర్స్ పర్సన్‌గా పుండరీ, హెచ్‌ఎం, రామచంద్రుడు, రాందాసు, మల్లికార్జున వ్యవహరించారని అంగన్వాడీ సూపర్‌వైజర్లు సహకరించారని తెలిపారు.

హుకుంపేటలో శిక్షణనిస్తున్న సిడిపిఒ బాలామణిదేవి

'మా గ్రామ పరిసరాల్లో మద్యం తాగొద్దు'

ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి హెచ్చరిస్తున్న ఉబ్బెడపుట్టు గ్రామస్తులు

ప్రజాశక్తి-పాడేరు : తమ గ్రామ పరిసరాలు, పంటపొలాలు, ఖాళీ ప్రదేశాల్లో మద్యం తాగొద్దని మండలంలోని చింతలవీధి గ్రామపంచాయతీ ఉబ్బెడిపుట్టు గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామస్తులు మూకుమ్మడిగా తీసుకున్న నిర్ణయాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తే తాము తీసుకునే చర్యలకు శిక్షార్హులౌతారని హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు గురువారం గ్రామానికి వచ్చే రహదారి ప్రవేశంతోపాటు గ్రామ పరిసరాలు, పంటపొలాల్లు ఎక్కడికక్కడే హెచ్చరికలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పంట పొలాల్లో మద్యం తాగి అక్కడే సీసాలు పగల గొట్టేడం వల్ల వ్యవసాయ పనులు చేసేటప్పుడు రైతులు, పశువులు కాళ్లకు గాజుపెంకులు గుచ్చుకుని తీవ్ర గాయాలయ్యాయని, కొన్ని పశువులు చనిపోయానని వారు విచారం వ్యక్తం చేశారు. దీనిపై తమ గ్రామంవైపు వచ్చేవారిని అనేకసార్లు విన్నవించినా వినకపోగా, గొడవలు పెట్టుకుంటున్నారని వాపోయారు. ఈ నేపథ్యంలో తమ గ్రామ పరిసరాల్లో ఇక ఎవరైనా మద్యం తాగితే కఠినమైన చర్యలు తీసుకుంటున్నారు. దీనికి అధికారులు కూడా సహకరించాలని కోరుతున్నారు. తమలాగే పంచాయతీ పరిధిలోని మిగిలిన గ్రామస్తులు కూడా మందుబాబుల ఆగడాలపై కఠినంగా వ్యవహరించాలని కోరుతున్నారు.

సచివాలయ పోలీస్ నూకరత్నం మాట్లాడుతూ ఇకపై గ్రామ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా మద్యం తాగి ఇబ్బందులకు గురిచేస్తే తనకు ఫోను ద్వారా సమాచారమిస్తే, వెంటనే వచ్చి వారిపై తగు చర్యలు తీసుకునేలా చూస్తానన్నారు. గ్రామంలో హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు సహకరించిన హెల్త్ అసిస్టెంట్ శెట్టి నాగరాజుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆయా పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల పరిధిలో అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుల భర్తీకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సిడిపిఒ నీలిమ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఖాళీ స్థానాల భర్తీకి నోటిపికేషన్ విడుదల చేశారన్నారు. మండలంలోని పోతంగి, కొర్రాయి, సాగర పంచాయతీల్లోని డుంబ్రిగుడ, జాకరగుడ, సాగర అంగన్వాడీ కేంద్రాలతోపాటు పీఎం జన్మన్ పథకం ద్వారా బుడ్డింగులో ఆయా పోస్టు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. 35 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండి, పదో తరగతి ఉతీర్ణతులై వారు వచ్చేనెల 4లోగా స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

ఫుల్‌బ్రైట్ స్కాలర్‌షిప్‌తో అమెరికాలో అధ్యయనం

ప్రజాశక్తి-మధురవాడ : భారతీయ విద్యార్థులకు, పరిశోధకులకు, వృత్తి నిపుణులకు అమెరికాలోని విద్యా సంస్థలలో అధ్యయనం చేయడానికి అవసరమైన నిధులను అందించి ప్రోత్సహించడంలో యునైటెడ్ స్టేట్స్ ఇండియా ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ (యుఎస్‌ఐఇఎఫ్) 75 సంవత్సరాలుగా కృషి చేస్తోందని యుఎస్‌ఐఇఎఫ్ ప్రాంతీయ అధికారి మాయా సుందర రాజన్ తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన వెబినార్‌లో ఆమె వివరాలను వెల్లడించారు. ఏటా ఫిబ్రవరిలో ఇందుకు సంబంధించిన ప్రకటన జారీ చేస్తామని, దరఖాస్తు గడువు మే నుంచి జులై మధ్య తేదీలలో ఉంటుందని తెలిపారు. యుఎస్‌ఐఇఎఫ్ ద్వారా ఫుల్‌బ్రైట్ నెహ్రూ మాస్టర్స్ ఫెలోషిప్, ఫుల్‌బ్రైట్ నెహ్రూ డాక్టోరల్ రీసెర్చి ఫెలోషిప్, ఫుల్‌బ్రైట్ నెహ్రూ పోస్ట్ డాక్టోరల్ రీసెర్చి ఫెలోషిప్ లను అందిస్తున్నామని వెల్లడించారు.

చింతపల్లిలో ఇంజనీరింగ్ కళాశాల ప్రకటనపై హర్షం

ప్రజాశక్తి-సీలేరు : అల్లూరి జిల్లా చింతపల్లిలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలెక్టర్ల సమావేశంలో ప్రకటించడం హర్షనీయమని జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కారే శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఒకప్పుడు నియోజవర్గ హెడ్ క్వార్టర్‌గా ఉన్న చింతపల్లి ఇప్పుడు అన్ని రంగాల్లో వెనుకబడి పోయిందన్నారు. ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు. జిల్లా, ఐటిడిఎ కేంద్రంగా ఉన్న పాడేరు, పర్యాటక ప్రాంతంగా ఉన్న అరుకు ప్రాంతాలపైనే ప్రభుత్వం, అధికార యంత్రాంగం దృష్టి పెట్టి, మిగతా ప్రాంతాల అభివృద్ధిని పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం, అధికారులు అభివృద్ధిని వికేంద్రీకరణ చేసి జిల్లాను సర్వతోముఖాభివృద్ధి చేయడానికి ఆలోచన చేయాలని కోరారు. చింతపల్లిలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత ప్రజలు ఆకాంక్షలు నెరవేర్చినట్లు అవుతుందన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని వివిధ అంగన్వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న కార్యకర్తలు, హెల్పర్ల పోస్టుల భర్తీకి అర్హులైన స్థానిక అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కొయ్యూరు సిడిపిఓ విజయకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోనియు.చీడిపాలెం, ఎం.భీమవరం పంచాయతీ జెర్రిగుంది గ్రామాల్లో ఆయా పోస్టులు, ఆడాకుల పంచాయతీ డి.కొత్తూరు, ఎం.భీమవరం పంచాయతీ వాలుగూడెం, కినపర్తి పంచాయతీ మునగలమెట్ట గ్రామాల్లో మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణత పొంది, స్థానికులై ఉండాలని, తహశీల్దారు జారీ చేసిన ఒరిజినల్ కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, భర్త నివాస ధ్రువపత్రం విధిగా సమర్పించాలని కోరారు. ఈనెల 26 నుండి ఏప్రిల్ 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయానికి నేరుగా గాని, పోస్టల్ ద్వారా గాని దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

నేటి నుండి నూకాలమ్మ జాతర మహోత్సవాలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని శ్రీనూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 28 నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు ఘనంగా జరగనున్నాయి. ఇందులో భాగంగా అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, వినోదాలు ఏర్పాటు చేసినట్లు గ్రామ సర్పంచ్ గొల్లపూడి రమణి, గ్రామ పెద్దలు గొల్లపూడి పెద్దిరాజు, ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు. 28న శుక్రవారం డ్యాన్స్ బేబీ డ్యాన్స్ స్టేజి పొగ్రాం, శక్తి వేషాలు, కోయ నృత్యాలు (తాడేపల్లి గూడెం వారిచే), కోలాట ప్రదర్శన, 29న శనివారం డ్యాన్స్ బేబీ డ్యాన్స్ స్టేజి పొగ్రాం (రాజమండ్రి వారిచే), నమో వెంకటేశాయ చైనా కోబ్రా డ్యాన్స్ (తాడేపల్లిగూడెం వారిచే), 30న ఆదివారం కోలాటం, తప్పెడుగుళ్ళు, నెల్లూరి వారి దుర్గా ఈవెంట్స్ డిజె పోగ్రాం, 31న సోమవారం, 1న మంగళవారం స్టేజి పోగ్రామ్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చిన్నపిల్లల కోసం ప్రత్యేక ఆకర్షణగా జాయింట్ వీల్స్, డ్రాగన్, డిస్కో, కొలంబస్, ఎయిర్ బౌన్సర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. భక్తులందరూ ఈ జాతర మహోత్సవాలలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పాలస్తీనాపై దాడి హేయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాలస్తీనాపై ఇజ్రాయిల్ మారణకాండను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ విశాఖపట్నం పౌర ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. పౌర ప్రజాసంఘాల సమన్వయకర్త పాత్రపల్లి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం కన్వీనర్ జెవి.సత్యనారాయణమూర్తి, మానవ హక్కుల వేదిక ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి విఎస్.కృష్ణ, పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి మాట్లాడారు.

కెజిహెచ్ అభివృద్ధికి రూ.2 కోట్ల విరాళం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ప్రజల ఆరోగ్య అవసరాలను తీర్చే కింగ్ జార్జి ఆసుపత్రి (కెజిహెచ్)లో మరిన్ని మౌలిక వసతుల కల్పనకు, అభివృద్ధి పనులకుగాను సిఎస్‌ఆర్ కింద ఎన్‌టిపిసి సంస్థ రూ.2 కోట్ల విరాళం ప్రకటించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్‌ను గురువారం ఆయన ఛాంబర్‌లో కలిసిన ఎన్‌టిపిసి సంస్థ ప్రతినిధులు సంబంధిత చెక్కును అందజేశారు. పేదలకు మరిన్ని వైద్య సదుపాయాల కల్పన, ఆధునిక వైద్య పరికరాలు కొనుగోలు, వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకుగాను సంబంధిత సిఎస్‌ఆర్ నిధులను ఉపయోగించాలని అధికారులకు ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. డయాలసిస్ యంత్రాల కొనుగోలుకు, ఆపరేషన్ థియేటర్ అభివృద్ధి కోసం వినియోగించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద తెలిపారు

లులూకు హోల్‌సేల్‌గా 99 ఏళ్లు

నగరం నడిబొడ్డున 13.43 ఎకరాల లీజు

గతంలో వివాదం... అయినా 'కూటమి' ఇష్టారాజ్యం

రూ.1500 కోట్ల విలువైన స్థలం సహా రాయితీలు, నజరానాలు, మినహాయింపులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

పక్కాగా ఇది ప్రైవేట్ గుత్త సంస్థకు సాగిలపడడమే..!. సుమారు రూ.1500 కోట్ల విలువైన 13.43 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్ లులూకు కూటమి ప్రభుత్వం కట్టబెట్టడం నేడు చర్చనీయాంశమవుతోంది. దీనిపై గతంలోనూ అనేక అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. నగరం నడిబొడ్డున ఆర్‌కె బీచ్‌కు ఎదురుగా ప్రభుత్వ స్థలాల పందేరంపై 2014-16 మధ్య కాలంలో పెద్ద దుమారమే చెలరేగింది. ప్రభుత్వ, ప్రజల ఆస్తులను కారుచౌకగా అప్పగించకూడదన్న వాదనలు బలంగా వినిపించాయి. ఇలా పలు అభ్యంతరాల నడుమ 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఆ భూములను ఎపిఐఐసి నుంచి విఎంఆర్‌డిఎ పరిధిలోకి తేవడమే గాకుండా ఆ లీజును రద్దు చేసింది. 2024లో అధికారం చేపట్టిన టిడిపి 'కూటమి' ప్రభుత్వం అదే లీజు వ్యవహారాన్ని తాజాగా పునర్లిఖించింది. ఏకంగా 99 ఏళ్ల పాటు లీజుకు లులూకిచ్చేసింది. అందుకోసం చంద్రబాబు ప్రభుత్వం విఎంఆర్‌డిఎ పరిధిలో ఉండే ఆ భూములను ఎపిఐఐసికి బదిలీ చేయాలని ఈ నెల 26న ఆదేశాలు జారీచేయడం అంతటా చర్చనీయాంశమైంది.

లులూకు ప్రభుత్వం అప్పగించనున్న స్థలమిదే..

విశాఖలో లులూ కథ ఇదీ...

విశాఖ నగరం నడిబొడ్డున హార్బర్ పార్కు భూములను లులూ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌కు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో ఆ సంస్థ ప్రతినిధులతో సమావేశం నిర్వహించినట్లు వార్తలు వచ్చాయి. ఈ నెల 13న రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పెట్టుబడుల సమావేశంలో లులూ సంస్థను ప్రభుత్వం ఫైనలైజ్ చేసింది. చంద్రబాబు ప్రభుత్వం గతంలో ఆర్‌కె బీచ్ ఎదురుగాగల సిఎంఆర్‌కు చెందిన విశ్వప్రియ ఫంక్షన్ హాలును లులూకు ఇచ్చేసింది. అదే సమయంలో నగరంలోని సీతమ్మధార, ఎంవిపి.కాలనీ, సిరిపురం ప్రాంతాల్లోని నగర నడిబొడ్డునగల 4.5 ఎకరాలను ప్రభుత్వం సిఎంఆర్‌కు కేటాయించింది. తిరిగి ఇప్పుడు విశ్వప్రియ ఫంక్షన్ హాలు వెనక భాగంలోని హార్బర్ పార్క్ స్థలం 13.43 ఎకరాలను లులూకు బాబు సర్కారు ధారాదత్తం చేయడం విమర్శలకు తావిస్తోంది. తాజాగా జారీ అయిన ఉత్తర్వుల ప్రకారం షాపింగ్ మాల్ ఏర్పాటు కోసం 99 ఏళ్లకు లీజుకు ఇవ్వాలి. మూడేళ్ల లేదా షాపింగ్ మాల్‌ను ప్రారంభించే తేదీ (ఏది ముందైతే దాని ఆధారంగా) అద్దె మినహాయింపు ఇవ్వాలి. ప్రతి పదేళ్లకోసారి మాత్రమే 10 శాతం చొప్పున అద్దె పెంచాలి. ఇన్ని రాయితీలు, నజరానాలు 'లులూ' సంస్థకు చంద్రబాబు కూటమి సర్కారు ఇవ్వడం అంటే దాదాపు దానోహమైనట్టే అన్న వాదన సర్వత్రా విశాఖలో వినిపిస్తోంది.

హార్బర్ పార్క్ భూములను లులూకు కట్టబెట్టొద్దు

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గు నాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తిరిగి హార్బర్ పార్క్ భూములను లులూ సంస్థకు కట్టబెట్టాలని నిర్ణయం తీసుకోవడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ భూములను కారు చౌకగా లులూ సంస్థకు కట్టబెట్టడమేంటని ప్రశ్నించారు. ఇది విశాఖ అభివృద్ధికి దోహదపడకపోగా తీవ్ర హాని చేసే చర్యని పేర్కొన్నారు. తక్షణం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఆ స్థలాన్ని సైన్స్ మ్యూజియం వంటి ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని కోరారు. ఆర్‌కె బీచ్ వద్ద వున్న సుమారు రూ.1500 కోట్ల విలువ కలిగిన 13.43 ఎకరాల ప్రభుత్వ భూమిని లులూ సంస్థకు కేటాయిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం చేసిందన్నారు. విఎంఆర్‌డిఎ ఆధీనంలో ఉన్న ఈ భూమిని వెంటనే ఎపిఐఐసికి బదిలీ చేయాలని ఆదేశాలు కూడా ఇచ్చిందన్నారు. గతంలో చంద్రబాబు అధికారంలో ఉండగా 2019లో ఆ భూమిని లులూ సంస్థకు కేటాయించగా ఆతరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని రద్దు చేసిందన్నారు. ఇప్పుడు తిరిగి కూటమి ప్రభుత్వం ఆ భూమిని లులూ సంస్థకు కారు చౌకగా కట్టబెట్టాలని నిర్ణయించిందన్నారు. ఈ నిర్ణయం విశాఖకు తీవ్ర హాని కలిగించడంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం చేకూరుస్తుందన్నారు. ప్రతి రోజూ లక్షల సంఖ్యలో ఆర్‌కె బీచ్‌కి వెళ్ళే ప్రజల ఆహ్లాదానికి ఆటంకంగా మారుతుందన్నారు. దీనివల్ల అనేక చిన్న సంస్థలు దెబ్బతిని, అందులోనివారు ఉపాధి కోల్పోతారన్నారు. ఈ సంస్థ వల్ల వచ్చే ఉపాధి అతి తక్కువ వేతనాలతో, విచ్చలవిడి కార్మిక దోపిడీతో కూడుకుని ఉంటుందన్నారు. తీర ప్రాంత నియంత్రణా జోన్ నిబంధనలకు ఈ కేటాయింపు విరుద్ధమని పేర్కొన్నారు. అంతేగాక ఈ సంస్థకు రాష్ట్రప్రభుత్వం కల్పిస్తున్న రాయితీల వల్ల ప్రభుత్వం ప్రతి ఏడాదీ వందల కోట్ల రూపాయల ఆదాయం నష్టపోతుందన్నారు.

99 ఏళ్ల లీజుతో పాటు ఆస్తి బదలాయింపు, నాలా వంటి ఛార్జీల మినహాయింపు, రాష్ట్ర జిఎస్‌టి మినహాయింపు, అందులో పనిచేసే ప్రతి ఉద్యోగికీ రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.7500 పిఎఫ్ కింద చెల్లింపు వంటి వందల కోట్ల మినహాయింపులు ఇస్తున్నట్టు తెలిపారు. గతంలో హార్బర్ భూములకు ఆనుకొని ఉన్న సిఎంఆర్ సంస్థకు చెందిన 3.43 ఎకరాల భూమి విస్తీర్ణంలో ఉన్న విశ్వ ప్రియ ఫంక్షన్ హాల్‌ను తీసుకొని లులూ సంస్థకు బదలాయించి సిఎంఆర్‌కి 1:15 ప్రాతిపదికన రూ.200 కోట్ల విలువ కలిగిన సుమారు 4.5 ఎకరాలను సీతమ్మధార, సిరిపురం, ఎంవిపిలలో కేటాయించారన్నారు. ఈ అడ్డగోలు భూ దోపిడీ ఇంతటితో ఆగదన్నారు.

నాటకోత్సవాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

తెలుగు నాటకాలు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తెలుగు నాటకాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆకాంక్షించారు. అంతర్జాతీయ నాటక దినోత్సవాలను పురస్కరించుకొని రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'లీడర్ విశాఖ జాతీయ నాటకోత్సవాలు -2025' పితాపురం కాలనీలోని కళాభారతిలో గురువారం సాయంత్రం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ తెలుగు నాటకాలను అంతర్జాతీయ స్థాయిలో నిలపడానికి ఇటువంటి ప్రదర్శనలు దోహదపడతాయని తెలిపారు. ఏప్రిల్ 16న కందుకూరి వీరేశలింగం జయంతిని తెలుగు నాటక దినోత్సవంగా జరపనున్నామన్నారు. త్వరలో జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఈ తరహా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాను ఆరు నెలల్లో రాష్ట్రానికి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. 2025లో నాటకాలకు, సినిమాలకు నంది అవార్డులు అందజేయనున్నామని ప్రకటించారు. అనంతరం మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ నాటకాలకు పూర్వ వైభవం రావాలని కోరారు. సుమారు 60 ఏళ్ల క్రితం ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని జరపాలని ఆనాటి పెద్దలు నిర్ణయించారని, అలా ప్రారంభించారని గుర్తు చేశారు. నాటకం దినదినాభివృద్ధి చెందుతుందని మహాకవి శ్రీశ్రీ అన్నారని, నేడు అదే జరుగుతుందని అన్నారు. ఆనాటి ఎన్టీఆర్, ఎఎన్నార్, ఎస్వీఆర్, సావిత్రి వంటి నటులు రంగస్థలం నుండే సినిమా రంగానికి వెళ్లారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి దుర్గాప్రసాద్, సెంచురియన్ యూనివర్సిటీ చాన్సలర్ జిఎస్‌ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు

ఆకట్టుకున్న ఐటమ్ నాటకం

అంతర్జాతీయ నాటక దినోత్సవాలలో భాగంగా రైటర్స్ అకాడమీ ఏర్పాటు చేసిన మొదటి నాటకం ఐటమ్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. గుజరాతీ నాటకం కావడంతో కొంత భాషాపరమైన ఇబ్బంది ఇక్కడి వారికి ఉన్నప్పటికీ ప్రేక్షకులు జేజేలు పలికారు.

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను తొలగించే చర్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఉక్కు యాజమాన్యం వెంటనే ఆపాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాల నుండి పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను యాజమాన్యం అకారణంగా తొలగించడం అన్యాయమని పేర్కొన్నారు. ఓ పక్క స్టీల్ ప్లాంట్‌ను అన్ని విధాల ఆదుకుంటామని, పూర్తి సామర్థ్యంతో నడిపేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని కూటమి ప్రభుత్వం చెబుతూనే మరోపక్క కాంట్రాక్ట్ కార్మికులను తొలగించేందుకు చర్యలు చేపట్టడం దుర్మార్గమన్నారు.

టెర్రరిస్టుల దాడులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అనుకోని రీతిలో జరిగే టెర్రరిస్టుల దాడులపై అవగాహన కలిగి ఉండాలని, అప్రమత్తంగా ఉంటూ ఎదుర్కోవాలని జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్ అన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల వద్ద తగిన సన్నద్ధత ఏర్పాట్లు చేసుకోవాలని, భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు, టెర్రరిస్టుల నుంచి జరిగే ప్రమాదాల విషయంలో అందరినీ అలర్ట్ చేసే విధంగా అలారం సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యతకత ఉందన్నారు. ఆక్టోపస్ సేవలపై సమీక్షలో భాగంగా గురువారం కలెక్టరేట్ మీటింగు హాలులో ఆయన అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది.